నమస్తే తెలంగాణ
కామారెడ్డి
3 | నిజామాబాద్, శనివారం 7 డిసెంబర్ 2024 | KAMAREDDY



ఆర్మూర్‌లో బీఆర్‌ఎస్ నాయకులను అరెస్టు చేసిన పోలీసులు

# బీఆర్‌ఎస్ నేతల అక్రమ నిర్బంధం


మోర్తాడ్/ఖలీల్‌వాడి/ఆర్మూర్ టౌన్, డిసెంబర్ 6 : బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలపై కాంగ్రెస్ సర్కారు దమనకాండకు పాల్పడుతున్నది. ప్రజాస్వామ్య వ్యవస్థలో నిరసనలు చేపట్టకుండా ముందస్తు పేరుతో అక్రమంగా నిర్బంధిస్తున్నది. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, పాడి కౌశిక్‌రెడ్డి అక్రమ అరెస్టులకు నిరసనగా హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై శుక్రవారం నిర్వహించనున్న ధర్నా కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా నుంచి ఎవరూ వెళ్లకుండా పోలీసులతో అడ్డగించింది. గులాబీ శ్రేణులను పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టు చేశారు. మాజీ ప్రజాప్రతినిధులు, నేతలను అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్లకు తరలించారు. నిజామాబాద్ జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావుని హౌస్ అరెస్టు చేశారు. ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాల వ్యాప్తంగా బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలను అరెస్టు చేశారు. ప్రజాస్వామ్యంలో నిరసన చేసే హక్కు లేకుండా చేసిన పోలీసులు, ప్రభుత్వ తీరుపై గులాబీ శ్రేణులు మండిపడ్డాయి. పోలీసు బలగాలతో ఆందోళనలు అణచాలని చూస్తే తిరుగుబాటు తప్పదని హెచ్చరించాయి.



జడ్పీ మాజీ చైర్మన్ విఠల్‌రావును హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు




ముప్కాల్‌లో బీఆర్‌ఎస్ నాయకులను అరెస్టు చేసిన పోలీసులు




- ఏడాది పాలనలో పెరిగిన నిర్బంధాలు
- అమలు కాని ఆరు గ్యారంటీలు
- నెరవేరని ప్రజల ఆకాంక్షలు
- ప్రశ్నిస్తే కేసులు.. అడిగితే అరెస్టులు
- సబ్బండ వర్గాల్లో వెల్లువెత్తుతున్న అసంతృప్తి

# ఎగవేతలు.. అణచివేతలు

రేవంత్ ప్రభుత్వానికి నేటితో ఏడాది

నిజామాబాద్, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఏడాదిలో ఎంత మార్పు. కాంగ్రెస్ రాకతో పాత రోజులు పునరావృతమయ్యాయి. నిర్బంధాలు, అణచివేతలు తీవ్రమయ్యాయి. హామీల ఎగవేతలే కాదు, పేదల ఇండ్ల కూల్చివేతలు సర్వసాధారణమయ్యాయి. రేవంత్ సర్కారు గద్దెనెక్కి నేటి(డిసెంబర్ 7)తో ఏడాది పూర్తి కానున్నది. ఈ సంవత్సర కాలంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు అడ్డుకట్ట పడింది. కాంగ్రెస్ వస్తే రైతుబంధు సహా అనేక పథకాలను ఎగ్గొడతారన్న బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ హెచ్చరిక వాస్తవరూపం దాల్చింది. ప్రజాపాలన, ఆరు గ్యారంటీల పేరుతో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ.. వాటి అమలులో పూర్తిగా విఫలమైంది.

## ఉమ్మడి జిల్లా పాలన గాలికి..

నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల పరిపాలనను ప్రభుత్వం గాలికి వదిలేసింది. ఉమ్మడి జిల్లా నుంచి ఏ ఒక్కరికీ మంత్రి పదవిని ఇవ్వకుండా వివక్షను ప్రదర్శించింది. రెండు జిల్లాల్లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు నలుగురు ఉన్నా ఎవ్వరికీ మంత్రి యోగం పట్టలేదు. ఇన్‌చార్జి మంత్రి చుట్టపు చూపునకే పరిమితమయ్యారు. ఇక, బీఆర్‌ఎస్, బీజేపీ ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాల్లో ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా, ప్రొటోకాల్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్ నేతలే పెత్తనం చెలాయిస్తున్నారు.

## మాట తప్పిన రేవంత్..

ఎన్నికలకు ముందు అనేక వరాలు కురిపించిన కాంగ్రెస్ అమలు చేయలేక 'చేతు'లెత్తేసింది. 18 ఏండ్లు పైబడిన మహిళలందరికీ నెలకు రూ.2,500 ఇస్తామన్న రేవంత్‌రెడ్డి మాట నిలబెట్టుకోలేదు. పింఛన్లు పెంచుతామన్న హామీ ఏడాది కాలంగా అమలుకు నోచుకోలేదు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తున్నప్పటికీ తగినన్ని బస్సులు లేక ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతి మండలంలో తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూళ్లు, రూ.5లక్షల భరోసా కార్డు ఊసే లేదు.

## గాడి తప్పిన ప్రభుత్వ యంత్రాంగం..

పదేండ్ల కేసీఆర్ పరిపాలనలో క్రమపద్ధతిలో నడిచిన యంత్రాంగం ఏడాదిలోనే గాడి తప్పింది. పైనుంచి కింది స్థాయి దాకా ఏ అధికారికీ భయమన్నదే లేకుండా పోయింది. ప్రజల సమస్యలపై స్పందించే వారు కరువయ్యారు. నిజామాబాద్ సీపీ పోస్టు రెండు నెలల నుంచి ఖాళీగా ఉన్నా కొత్త వారిని నియమించలేదు. దీంతో శాంతి భద్రతలు అదుపు తప్పుతున్నాయి. దొంగతనాలు పెచ్చుమీరాయి. పోలీసు బాస్ కుర్చీ ఖాళీగా ఉండడంతో ఠాణాల్లో ఖాకీల ఇష్టారాజ్యం పెరిగింది. గ్రామాల్లో పారిశుద్ధ్యం పూర్తిగా లోపించింది. పట్టణాలు, నగరాల్లో పురపాలిక పట్టు తప్పింది. రేవంత్ ప్రభుత్వ ఏడాది పాలన ఎలా ఉందో చెప్పడానికి రోడ్లపైకి వస్తున్న జనాలే మంచి ఉదాహరణ.

## రైతులను ముంచిన కాంగ్రెస్..

రైతులకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ విఫలమైంది. రైతుభరోసా కింద ఎకరాకు రూ.15 వేలు కాదు కదా.. గతంలో ఇచ్చినట్లు రూ.10 వేలు కూడా ఇవ్వకుండా ఎగ్గొట్టింది. రైతులందరికీ రూ.2లక్షల లోపు రుణ మాఫీ చేస్తామన్న మాట నిలబెట్టుకోలేదు. ఉమ్మడి జిల్లాలో 1.50 లక్షల మందికి రుణ మాఫీ చేయలేదు. అన్ని పంటలకు మద్దతు ధర, బోనస్ ఇస్తామని మాట తప్పింది. కేవలం సన్న ధాన్యానికి మాత్రమే రూ.500 బోనస్ ఇచ్చి దొడ్డు రకాలకు ఇవ్వకుండా రైతులను మోసగించింది.

# నేడు, రేపు ఆటో షో



వాహనాల ప్రదర్శనకు ఏర్పాటు చేసిన స్టాళ్లు

- 'నమస్తే తెలంగాణ' ఆధ్వర్యంలో వాహనాల ప్రదర్శన
- ఒకే వేదికపైకి ప్రముఖ వాహనాల కంపెనీలు
- బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థలు కూడా..
- సందర్శకులకు ఉచిత ప్రవేశం

ఖలీల్‌వాడి, డిసెంబర్ 6 : ప్రముఖ కంపెనీల కార్లు, ద్విచక్ర వాహనాలు ఒకే వేదికపైకి రానున్నాయి. జాతీయ, అంతర్జాతీయ స్థాయి వెహికిల్స్ ఇందూరులో సందడి చేయనున్నాయి. 'నమస్తే తెలంగాణ–తెలంగాణ టుడే' ఆధ్వర్యంలో శని, ఆదివారాల్లో పాత కలెక్టరేట్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న ఆటో షో ఇందుకు వేదిక కానున్నది. ఔత్సాహిక కొనుగోలుదారులందరికీ అన్ని రకాల వాహనాలను ఒకే వేదికపై అందించాలన్న ఉద్దేశంతో 'నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే' గత మూడేండ్లుగా దిగ్విజయవంతంగా ఆటో షోను నిర్వహించింది. ప్రజల స్పందనను స్ఫూర్తిగా తీసుకుని మరోసారి వాహన ప్రదర్శనకు ఏర్పాట్లు చేసింది. రెండ్రోజుల పాటు ఉదయం 9 నుంచి రాత్రి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ఆటో షోకు వచ్చే సందర్శకులకు ప్రవేశం ఉచితం. కాలానుగుణంగా వస్తున్న మార్పులతో పాటు వాహనదారుల అభిరుచికి అనుగుణంగా మార్కెట్‌లోకి వస్తున్న అధునాతన వాహనాలను ఇక్కడ ప్రదర్శనకు ఉంచనున్నారు.

అలాగే, వాహనాల కొనుగోలుకు అవసరమైన లోన్లు ఇచ్చేందుకు బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థలు కూడా ఇక్కడ కొలువుదీరనున్నాయి. కియా, మారుతి, నిస్సాన్, హ్యుండాయ్, నెక్సా, టాటా, రాయల్ ఎన్‌ఫీల్డ్, హీరో, హోండా, టీవీఎస్, ఏథార్, చేతక్ తదితర కంపెనీలు షోలో పాల్గొంటున్నాయి. యూనియన్ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా సందర్శకుల కోసం ఇక్కడ స్టాళ్లు ఏర్పాటు చేశాయి.



















